వెంటనే చచ్చి వుండేవాడు. దేవుడు నీకన్నా, నాకన్నా తెలివైనవాడు కాబట్టే మనం కోరిన ఏ ఒక్క కోరికా తీర్చడు. కోరక పోయినా మనకి అవసరమైనవన్నీ తీరేలా చేస్తాడు. తీరని కోరికలన్నీ దేవుడి దీవెనలు."

## 25. ఉషోదయం

కొందరు భక్తులు కార్తీక పౌర్ణమికి శ్రీశైలం వెళ్తూ, దారిలో కనబడ్డ ఓ ఆశ్రమాన్ని చూసి బస్సు ఆపించి, అంతా లోపలికి వెళ్ళారు. ఆ ఆశ్రమంలోని ఓ సన్న్యాసిని చూసి తమని తాము పరిచయం చేసుకున్నాక, కాసిని మంచి మాటలు చెప్పమని కోరారు.

"మనం ఎప్పుడు చీకటి పోయి వెలుతురు వచ్చిందని గ్రహించగలం?" ప్రశ్నించాడా సన్న్యాసి.

"గాడిదో, గుర్రమో స్పష్టంగా తెలుసుకున్నప్పుడు." చెప్పారు ఒకరు.

"తప్పు."

ఇంకొకరి వైపు చూసాడు సన్న్యాసి.

"మామిడి చెట్టో, మర్రి చెట్టో స్పష్టంగా తెలుసుకోగలిగినప్పుడు." చెప్పాడతను.

మళ్ళీ ఆ సన్న్యాసి చిరునవ్వుతో తల అడ్డంగా ఊపాడు.

"సరైన సమాధానం మీరే చెప్పండి."

"ఏ మగాడి మొహాన్ని చూసినా, మీ సోదరుడిని, అలాగే ఏ ఆడదాని మొహం చూసినా మీ సోదరిని చూడగలిగినప్పుడు, మీలోని చీకట్లు తొలగి, వెలుగు పూర్తిగా ప్రవేశించినట్లు అర్థం." వివరించాడా సన్న్యాసి

## 26. జ్ఞాని

ఋషికేశ్‌లో గంగానది ఒడ్డున ఉన్న ఓ యోగికి వీపు మీద చిన్న కురుపు లేచింది. ఆ వ్రణం తగ్గకుండా క్రమేపీ పెరగసాగింది. అవసాన